# విశ్వవిభుడు వేంకటేశ్వరుని సువర్ణ రత్నాభరణ సంపదను వెలగట్టగలమా?

ఏ దేవుడు, దేవేరిలకిన్ని నగలున్నాయ్! ఎన్నెన్ని నిత్యభోగాలున్నాయ్! ఎందరెందరు ఎన్ని కాలాలందు కొలిచారు! కొలుస్తున్నారు! సాహితీ సమరాంగణా చక్రవర్తి, శ్రీనివాసానువర్తి శ్రీకృష్ణదేవరాయలెన్ని పర్యాయములు తన దేవేరిలతో దర్శించాడు! ఇన్ని మహిమలు కల ఇల వేంకటవిభుణ్ణి అన్నమయ్య ఎన్ని వేల సంకీర్తనలు కూర్చి అర్చించాడు.

వేల్పులకు వేల్పు వేంకటేశా! కేసములు తీసుకుని క్లేసాలు తొలగించే కేశవా! తిరుమలేశుడి వైభోగం అంతా ఆయన ఆభరణాల ధగధగల్లోనే కనిపిస్తుంది. నల్లని మేని ఛాయకు స్వర్ణాభరణాలు వింత శోభనిస్తాయి. రోజుకో అలంకరణ.. ప్రతి అలంకరణకూ మారే ఆభరణాలు.. వజ్రాలు పొదిగిన శంఖు చక్రాలు, రతనాల హస్తాలు, ముత్యాల హారాలు, స్వర్ణ పీతాంబరాలు, బంగారు పాదాలు, పాద పీఠాలు, నీలాలు, పచ్చలు, కెంపులు పొదిగిన ఆభరణాలు... స్వామి తనువెల్లా బంగారమే. మనసంతా కరుణే. మూలవర్లకున్నట్టే ఉత్సవర్లకూ అన్ని ఆభరణాలు ఉన్నాయి. స్వామితో పాటూ ఇద్దరు దేవేరులకూ ఏడు వారాల నగలున్నాయి. స్వామి వరద, కటి హస్తాలు కూడా వజ్ర ఖచితమే. ఉత్సవర్లకు మూడు రకాల బంగారు కవచాలు అలంకరిస్తారు. వీరన్నశెట్టి వజ్ర కవచం, ముత్యంగి కవచం, స్వర్ణ కవచం, వెంకన్న సంపదకు విలువ కట్టలేమంటారు. అయితే ఆయన ఆభరణాలను అంచనా వేసిన నిపుణులు వీటి విలువ ఎన్ని వేల కోట్లో అంటున్నారు.

ఓం శిరసే వజ్రకిరీటం – వదనే శశివర్ణ ప్రకాశం
ఫాలే కస్తూరీ శ్రీగంధతిలకం – కర్ణే వజ్రకుండల శోభితం
కంఠే సువర్ణపుష్పమాలాలంకృతం హృదయే శ్రీనివాస మందిరం
కరుణే కరుణాభయసాగరం। భుజే శంఖు చక్రగదా మందిరం
స్కంధస్త్ర సువర్ణ యజ్ఞోపవీతం – సర్వాంగే స్వర్ణ పీతాంబరధరం
పాదౌ పరమానందరూపమ్ – సర్వపాప నివారకం
సర్వం స్వర్ణమయం నామపావనం శ్రీ వేంకటేశమ్
నమామి శ్రీ వేంకటేశం శ్రీనివాసం నమామి!

**ప్రణతులు ప్రణతులయ్యా! పద్మావతీ వేంకటేశా!**
**వినతులు మా వినతులయ్యా వేంకటాద్రివాసా!**

**వేయి వేల్పుల వేంకటేశా -**
**వేయిపడగల శేష నివాసా!**





















